సాక్షి నిజామాబాద్

బుధవారం । 31 । మే । 2023



వీసీ రాజీనామా చేయాలి

అవినీతి, అక్రమాలకు పాల్పడిన తెలంగాణ వర్సిటీ వీసీ రవీందర్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

- 8లో ▸



మళ్లీ దంచికొట్టిన వాన

జిల్లాలోని పలుచోట్ల సోమవారం రాత్రి వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
41.5 /30.0

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన వైద్య సేవలందించాలి



బోధన్: వైద్యులు, సిబ్బంది సమన్వయం, సమిష్టిగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని నేషనల్ క్వాలిటీ ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్ టీం వైద్యులు కుముద్ బనియా, ఇందర్‌దీప్ కౌర్‌లు సూచించారు. పట్టణ కేంద్రంలోని పాన్‌గల్లీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు నాణ్యత ప్రమాణాలతో వైద్యం అందించాలన్నారు.

ఆలయాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయశాఖ తరపున రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ సుప్రియ మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 2న అన్ని ఆలయాలను అలంకరించడంతో పాటు సాయంత్రం ప్రమీదలతో దీపాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూన్ 21, 22 తేదీల్లో తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వేద పారాయణ, భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, పురాణ ప్రవచన కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు సహాయక కమిషనర్ తెలిపారు.

ధాన్యం వ్యాపారి నిర్బంధం



భీమ్‌గల్: తమకు ధాన్యం డబ్బులు ఎగ్గొట్టాడని వ్యాపారిని మంగళవారం మండలంలోని జాగిర్యాల్‌లో రైతులు నిర్బంధించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన వ్యాపారి గంప శ్రీనివాస్ గుప్తా గతేడాది భీమ్‌గల్ మండలంలోని డీబీ తండా, కుప్కల్, జాగిర్యాల్ గ్రామాలకు చెందిన దాదాపు 120 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించి రూ. కోటి 30 లక్షల డబ్బులు ఇప్పటి వరకు రైతులకు చెల్లించలేదు. దీంతో మూడు గ్రామాలకు చెందిన రైతులు వ్యాపారిని జాగిర్యాల్‌లో నిర్బంధించారు. డబ్బులు చెల్లించేవరకు వదిలే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. గతంలో వ్యాపారి రైతులకు చెక్కులు ఇవ్వగా అవి బౌన్స్ అయ్యాయని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళా సాధికారత



డిచ్‌పల్లి: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకున్నప్పుడే మహిళా సాధికారత సాధిస్తామని మహిళా ప్రపంచబ్యాంక్ ప్రతినిధి, సౌత్ ఏషియా సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ నిర్మల వేదుల సూచించారు. మంగళవారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి రైతువేదిక భవనంలో ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళా సాధికారత, జన సురక్ష' అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. సదస్సుకు హాజరైన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న జన సురక్ష పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ ప్రతినిధి దీపక్ అలోక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ మహేశ్, చీఫ్ మేనేజర్ విజయ్‌కుమార్, రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, టీజీబీ నడిపల్లి బ్రాంచ్ మేనేజర్ పీవీపద్మ పాల్గొన్నారు.

పాతూర్లు.. మా సెంటిమెంట్

- శ్రీరాంసాగర్ ముంపు గ్రామాలతో వీడని అనుబంధం
- తేలిన ఆలయాలను దర్శించుకుంటున్న ఆయా ఊర్ల ప్రజలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులు.. తమ గ్రామాలు, భూములు ముంపునకు గురై సుమారు యాభై ఏళ్లవుతున్నా.. పాతూర్లతో అనుబంధం, మమకారాన్ని తెంచుకోలేకపోతున్నారు. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో నీళ్లు వెనక్కి వెళ్లిన సందర్భాల్లో గ్రామాల ఆనవాళ్లు, గుళ్లు తేలుతున్నాయ్.. ఆ భూముల్లోకి వెళ్లి గుళ్లల్లో పూజలు చేస్తున్నారు. పాత జ్ఞాపకాలను మననం చేసుకుంటున్నారు. ముంపు తర్వాత ఎక్కడెక్కడి గ్రామాలకో వెళ్లి స్థిరపడిన వారూ తమ ఇంటి దేవుడంటూ సెంటిమెంట్‌తో వచ్చి గుళ్లలోని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పిస్తున్నారు. వానాకాలం సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో పంట విత్తనాలను దేవుడికి చూపించి వెళ్తున్నారు. డొంకేశ్వర్ మండలంలోని గాదెపల్లి(చిన్నయానం), జీజీ నడ్కుడ గ్రామాల ముంపు భూముల్లో పరిశీలనకు వెళ్లిన 'సాక్షి'కి ఇవే దృశ్యాలు కనిపించాయి.


–బి.ప్రభాకర్, నిజామాబాద్ డెస్క్




జీజీనడ్కుడ ముంపు ప్రాంతంలోని మల్లన్న గుడి



హనుమాన్ విగ్రహం, జీజీనడ్కుడ



మునీశ్వరుడి ఆలయం, జీజీనడ్కుడ



ముంపు నుంచి తేలిన గాదెపల్లి బావులు



జీజీనడ్కుడ మల్లన్న గుడిలో పూజ చేస్తున్న మహిళ

పంట విత్తే ముందు నైవేద్యం..



మాది గాదెపల్లి ముంపు గ్రామమే.. ఇప్పుడు బట్టాపూర్‌లో ఉంటున్నాం. మా తాతపేరు మేకల తక్కన్న.. మాకు నాలుగైదు వందల మేకలుండేవట. గ్రామం ముంపునకు గురికావడంతో మేకలకు జాగలేకుండా పోయింది. మావోళ్లు మేకలు తీసుకుని ఏర్గట్ల మండలం బట్టాపూర్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ కొనుక్కున్న భూమి ఐదెకరాలు ఉంది. పసుపు పోస్తున్నాం.. ఇక్కడి మల్లన్న దేవుడు మాకు సెంటిమెంట్ ప్రతి యేడు మాదిరే మల్లన్న దేవుడికి పసుపు చూపిచ్చి, నైవేద్యం పెట్టి వెళ్తన్నాను. నేను పదిహేనేళ్లుగా వస్తున్నాను. అంతకు ముందు మా నాన్న వచ్చేవాడు. భూముల ముంపు కింద రూ. లక్ష వస్తే రూ. 40 వేలే మావోళ్ల చేతికొచ్చినయ్.. మిగతా వకీళ్ల ఫీజు, మధ్యవర్తులకు కమీషన్ల కింద పోయినయ్..

– గంగాధర్, బట్టాపూర్, ఏర్గట్ల మండలం

- ఆ టైంలో వందెకరాలు ఉన్న భూ స్వామి కూడా ఇప్పుడు బికారైండ్రు.. ఆ సమయంలో చేతిలో డబ్బు న్నోళ్లు భూములు కొనుక్కొని బతికిపోయిండ్రు..
- ముంపు భూముల పరిహారం రైతుల చేతికంద లేదు. మధ్యవర్తులు భారీ కమీషన్లు తీసుకున్నరు. కోటీశ్వరులయ్యారు. ప్రభుత్వం నేరుగా రైతులకు డబ్బులు ఇస్తే బాగుండే..
- భూ నిర్వాసితులకు రాజ్యాంగ బద్ధంగా ఇళ్లు చూపాలి, ఉద్యోగం ఇవ్వాలి.. ఒక్కటి కూడా పొందలేదు. భూములు పోయినయ్, ఇండ్లు పోయినయ్..
- నిర్వాసిత గ్రామాల్లో నిరుద్యోగులు చాలా మంది ఉన్నారు. ఉపాధి లేకుండా పోతోంది. గాదెపల్లిలో సుమారు 50 మంది గ్రాడ్యుయేట్స్ ఉంటారు. గ్రూప్ -1, 2 రాస్తున్నారు. మండల కేంద్రంలో కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి. చుట్టు పక్కల నిర్వాసిత గ్రామాల నిరుద్యోగులకు ఉపయోగపడుతుంది.

–భూనిర్వాసితులు

మా ఇండ్లు కండ్లల్ల తిరుగుతయ్..



భూదేవి, జీజీనడ్కుడ

ఇక్కడే పుట్టిన, ఇక్కడే పెరిగిన.. మా ఆయనది ఇదే ఊరు..ఈ ముంపు భూముల్లోకి వస్తే మా ఇండ్లు కండ్లళ్ల తిరుగుతయ్.. అదిగో అక్కడ స్కూలు ఉండే.. స్కూళ్లో ఉక్క అండిండ్రంటే ఉరికి తెచ్చుకుంటుంటిమి. ఇది పటేండ్ల భూమి ఇక్కడ పెద్ద బాయి ఉండే.. అటు దిక్కు కట్టకు మల్ల కిష్టరెడ్డి గిండ్రి ఉండే.. పూల చెట్టు.. దానిమ్మ చెట్టు ఉండే గార్డెన్ లెక్క కనిపిస్తుండే.. ఇదంతా మల్లన్న గుడి జాగ ఆ గెట్టు కాడికెల్లి రథం తిరుగుతుండే.. అక్కడ మునీశ్వరుడి గుడి, అక్కడ హన్మాండ్ల గుడి ఆడ మా ఇల్లు ఉండే.. ఊరు మునిగిపోవడంతో ఊరిమందంతా ఎక్కడెక్కడికో పోయిండ్రు.. దగ్గర చుట్టాలు దూరమైండ్రు.. గిద్ద, దిలావర్‌పూర్, కొత్త నడ్కుడ, నందిపేట ఊర్లకోయి స్థిర పడ్డరు.. మా తల్లిగారిచ్చిన పది బిగాలు ముంపులో పోతే రూ. 12వేలు వచ్చినయ్.. మా అత్తగారిది 15 బిగాల రాగడి భూమి పోయింది..

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో తేలిన మల్లన్న (నడ్కుడ) గుడికి వచ్చిన భూదేవి చెప్పిన మాటలివి. భూ దేవి కుటుంబం ప్రతి వేసవిలో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ వెనక్కి వెళ్లిన తర్వాత మల్లన్నగుడి కి వచ్చి మొక్కులు తీర్చుకుంటుంది. వీరి కుటుంబమే కాదు.. ఊరి ప్రతి కుటుంబం ముంపు లోని మల్లన్నగుడికి వచ్చి పండగ చేసుకుంటరు.

ఆ భూములుంటే ఇప్పుడు కోటీశ్వరులం..



మా పూర్వీకుల భూమి ముంపులో 12 ఎకరాలు పోయింది. ఆ భూములుంటే ఇప్పుడు కోటీశ్వరులం.. జగిత్యాల జిల్లా దొంతాపూర్ వద్ద రెండెకరాలు ఇచ్చారట..ఆ భూమి కూడా ఎక్కడుందో.. ఎట్లుందో.. సర్వే నంబర్ కూడా తెలియదు. మేమప్పుడు చిన్నగున్నం.. మా తాతలు పోయిన తర్వాత అస్సలేం తెలియకుండా పోయింది. మా బాపులకు కూడా భూములు ఎక్కడున్నాయో తెలియదు. కలెక్టర్ ఇచ్చిన నోటీసులైతే ఉన్నయ్..

– మోహన్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు, గాదెపల్లి

పాతూర్లు బాగుండే..



మాది కుస్తాపురం.. మేము గూండ్లోళ్లం.. కుస్తాపురం మునిగిపోయినంక అటు చెరువులేక ఊరునిడిసేసినం.. 50 ఏండ్ల సంది గాదెపల్లిలో ఉంటున్నాం.. గాదెపల్లి, కుస్తాపురం పాతూర్లు నంబర్ ఏక్ ఉండే.. గాదెపల్లి పాతూరులో పద్మశాలి రెండొందల గడప, పటేండ్లు వంద గడప, తెనుగోళ్లు వంద గడప ఉండే.. కుస్తాపురంలో పద్మశాలి గడప 150, బామండ్లు మున్నూరు గడప, గూండ్లోల్లు 50 గడప ఉండే.. అప్పుడు బర్కతుండే ఖర్చుతక్కువుండే.. ఇప్పుడు ఖర్చెక్కువ.

– నర్సయ్య, గాదెపల్లి

పెద్దపెద్దోళ్లు మా ఊర్లకు వస్తున్నారు



గోదావరి తీరంలోకి జింకలు, విదేశీ పక్షులు రావడంతో వాటిని చూసేందుకు పర్యాటకులు, పెద్దపెద్దోళ్లు చిన్నయానంకు వస్తున్నారు. దీంతో ఊరికి పేరైతే వస్తుంది గానీ. గ్రామాభివృద్ధికి జరుగుతున్న మేలు లేదు. పర్యాటకులు సేద తీరేందుకు ఇక్కడ ఐదెకరాల పార్క్ ఏర్పాటు చేయనున్నారు.

– హరికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్, గాదెపల్లి

ఏటా వచ్చి మొక్కుతాం..



పాతూర్ల అనుబంధం ఎన్నటికీ పోదు.. ఈ భూమంతా మాదే. ఈ పొలం మాదే. ప్రతి సంవత్సరం మల్లన్న గుడికొచ్చి మొక్కుతాం. పాత జ్ఞాపకాలు మర్చిపోలేం.

– రజిత, జీజీ నడ్కుడ

దుర్వినియోగ పర్వం..

- తెయూలో ఈసీ అనుమతి లేకుండా ఇబ్బడిముబ్బడిగా చెల్లింపులు
- ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేరిట భారీగా ఖర్చు.. కళాశాలల నుంచీ వసూళ్లు
- ఖర్చుల కింద రూ. 15.21 లక్షలు డ్రా చేసుకున్న విద్యావర్ధిని
- వర్సిటీకి సంబంధం లేని దళితబంధు, బంగారు తెలంగాణ సెమినార్ల పేరుతో సైతం..
- రిజిస్ట్రార్ ఫండ్ అకౌంట్ నుంచి అక్రమ చెల్లింపుల వ్యవహారం
- ఒక్కరోజు విచారణలోనే బహిర్గతం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ వర్సిటీలో రిజిస్ట్రార్ పదవి విషయంలో రెండేళ్లుగా సాగుతున్న రగడ ఎప్పటికప్పుడు కొత్త మలుపులు తీసుకుంటోంది తప్ప ఎండ్ కార్డ్ పడడం లేదు. ఆర్థిక వ్యవహారాల నేపథ్యంలోనే చెక్ పవర్ కలిగి ఉన్న రిజిస్ట్రార్ పదవిలో తాను చెప్పిన వాళ్లే ఉండాలనే లక్ష్యంతో వీసీ రవీందర్‌గుప్తా వ్యవహరిస్తూ వచ్చారు. మరోవైపు ఇదే అదనుగా ఇన్‌చార్జులుగా వీసీ ద్వారా నియమితులైన కొందరు రిజిస్ట్రార్లు సైతం అక్రమ చెల్లింపుల పర్వం నడిపినట్లు తెలుస్తోంది. 55వ పాలకమండలి సమావేశం నియమించిన ఐదుగురు సభ్యుల కమిటీ ఒక్కరోజు జరిపిన విచారణలోనే భారీ అక్రమ చెల్లింపులు వెలుగుచూశాయి. దీంతో ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి తదుపరి విచారణ ముందుకు సాగకుండా ఉండేందుకు వీసీ ఆగమేఘాల మీద హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. కాగా ఐదుగురు సభ్యుల కమిటీ విచారణలో అనేక విచ్చలవిడి చెల్లింపులు బయటపడినట్లు తెలుస్తోంది. 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఇప్పటివరకు ఈసీ అ నుమతి లేకుండానే ఖర్చులు చేయడం అక్రమాలకు పరాకాష్టగా నిలుస్తోంది. పూర్తి స్థాయి విచారణ చే స్తే ఎన్ని అక్రమాలు బయటకొస్తాయో అని అంచ నా వేసుకుంటేనే విస్మయం కలుగుతోంది.

దండుకున్నారిలా..

నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో 2022 ఆగస్టు 1, 2, 3 తేదీల్లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ కోసం వీసీ రవీందర్ వర్సిటీ పరిధిలోని ఒక్కో కళాశాల వద్ద రూ.2 లక్షల మేరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ కాన్ఫరెన్స్ పేరిట భారీగా దండుకోవడంతో పాటు వర్సిటీ నిధుల నుంచి సైతం విచ్చలవిడిగా ఖర్చులు చేయడం విశేషం. ఇందుకోసం ఎస్టేట్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ అసిస్టెంట్, వీసీ పీఏ పేరిట ఏకంగా రూ.10 లక్షలు డ్రా చేయడం గమనార్హం.

- ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన కనకయ్య తన పేరిట వివిధ ఖర్చుల నిమిత్తం రూ.5.44 లక్షలు డ్రా చేశారు. ఇందులో దళిత బంధు, బంగారు తెలంగాణ సెమినార్లు ఉండడం విచిత్రం. మరో విచిత్రమేమిటంటే కాళోజీ జయంతికి కనకయ్య హైదరాబాద్ ట్రావెలింగ్ ఖర్చులు రూ.40,000 ఉండడం విశేషం. పాటకు పట్టాభిషేకం అనే కార్యక్రమానికి రూ.25వేలు, పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు రూ.62వేలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కోసం రవాణా ఖర్చులు రూ.1లక్ష, ఈసీ మీటింగ్ ఖర్చులు రూ.1.80 లక్షలు ఉన్నాయి.
- విద్యావర్ధిని సెల్ఫ్ చెక్కుల ద్వారా తీసుకున్న ఖర్చుల వివరాలు చూస్తే విస్తుపోవాల్సిందే. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పేరిట ఏకంగా రూ.11 లక్షలు డ్రా చేసుకోవడం విశేషం. విద్యావర్ధిని ఏకంగా మొత్తం రూ.15.21 లక్షలు డ్రా చేసుకోవడం గమనార్హం.
- మహనీయుల జయంతి పేరిట రూ.50 వేలు, పీహెచ్‌డీ ఇంటర్వ్యూల పేరిట రూ.40 వేలను మరో అవుట్ సోర్సింగ్ వ్యక్తికి చెల్లించడం విశేషం. ఇలా చెప్పుకుంటూ పోతే జూనియన్ అసిస్టెంట్ల పేరిట డ్రా చేసిన మొత్తం భారీగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో మరిన్ని అక్రమ చెల్లింపుల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి



ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మంత్రి మల్లారెడ్డి, పక్కన ఎమ్మెల్సీ కవిత తదితరులు

- కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధి
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి

మాక్లూర్: రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు డిపాజిట్లు రాకుండా చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అడవి మామిడిపల్లి వంజరి సంఘ భవనంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. ఇంకా ప్రజలకు ఏదో చేయాలని పరితపిస్తున్నారన్నారు. ప్రజల కోసం ఏమి చేయని కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే అర్హత లేదని, సిగ్గు విడిచి గ్రామాల్లోకి వస్తే చీపుర్లతో కొట్టాలన్నారు.

రంది పెట్టుకోవద్దు.. ప్రజల ఓట్లు బీఆర్‌ఎస్‌కే..

కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారని.. పార్టీ శ్రేణులు ఎలాంటి రందీ పెట్టుకోకుండా పార్టీ కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన బీఆర్‌ఎస్ గెలుపును ఆపలేరని ఆమె ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో ఒక ఈఎస్‌ఐ ఆస్పత్రి మంజూరు చేయించినట్లయితే కామారెడ్డి, నిజామాబాద్ బీడీ కార్మికులకు ఉపయోగకరంగా ఉంటుందని, అలాగే భవన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అక్కడే ఉన్న కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డిని ఎమ్మెల్సీ కవిత కోరారు. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆశా భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాసనమండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, గ్రంథాలయ చైర్మన్ ఎల్‌ఎంబీ రాజేశ్వర్, రాజారాంయాదవ్, బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి, మధుశేఖర్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన దశాబ్ది ఉత్సవాలు

సుభాష్‌నగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పక్కా ప్రణాళికతో గ్రామగ్రామాన అట్టహాసంగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. దశాబ్ది ఉత్సవ ఏర్పాట్ల సన్నద్ధతపై మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు ఇన్‌చార్జీలను నియమించుకుని నిశితంగా పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాస్థాయిలో కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక విభాగం ద్వారా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లతో కూడిన వివరాలు రోజువారీగా సాయంత్రం నాలుగు గంటల్లోపు కంట్రోల్ రూంకు పంపించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతిఒక్కరూ దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా జూన్ 3న రైతు దినోత్సవం సందర్భంగా రైతు వేదికలను ముస్తాబు చేయాలని, ప్రతి గ్రామం నుంచి రైతులను సమీకరించి అలంకరించిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ప్రదర్శనగా తరలివచ్చేలా చూడాలన్నారు. 8న తెలంగాణ చెరువుల పండుగ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా చొరవ చూపాలన్నారు. జూన్ 22న అమరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ అమరవీరులకు మౌనం పాటించి నివాళులర్పించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రెయినీ అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నేటి నుంచి 'ఓపెన్' సెమిస్టర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: నగర శివారులోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలోగల డా.బీ.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ యూజీ సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపుకార్డును తీసుకురావాలన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి, ఎమ్మెల్సీకి ఆర్పీల వినతి



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ జిల్లా ఆర్పీ(రీసోర్స్‌ పర్సన్స్‌)ల వైస్‌ ప్రెసిడెంట్‌ ధోండి స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలి శారు. ఆర్పీలకు డ్రెస్‌కోడ్‌, జీవో మార్పిడి, పీఆర్‌సీ, ప్రమాదబీమా వర్తించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

రోడ్డెక్కిన అన్నదాత



మాచారెడ్డి: రైస్‌ మిల్‌ సిబ్బంది తాము తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు రోడ్డెక్కారు. భవానిపేట శివారులో భూలక్ష్మీ రైస్‌ మిల్‌ వద్ద కామారెడ్డి– సిరిసిల్ల రహదారిపై వడ్ల ట్రాక్టర్లతో రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. నాలుగు రోజులుగా ట్రాక్టర్లు, లారీల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఎండకు ఎండుతూ..వానకు తడుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సంతోష్‌ కుమార్‌ ఘటనా స్థలానికి వెళ్లి రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మద్నూర్‌(జుక్కల్‌): మహిళల ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌ సింగ్‌ సూచించారు. డోంగ్లీ పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం సందర్భంగా ఆయన ఆస్పత్రిని సందర్శించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎనిమిది రకాల రోగాల నిర్ధారణ, చికిత్స, అవసరాన్ని బట్టి రెఫరల్‌ సేవలు అందిస్తామన్నారు. ఈ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు రీతుపటేల్‌ పాల్గొన్నారు.

కుక్క దాడిలో నలుగురికి గాయాలు

నవీపేట: మండలంలోని నారాయణపూర్‌లో మంగళవారం పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన షేక్‌ సల్మాన్‌, రఫియా బేగం, చాకలి పెద్ద గంగారం, ఖ్యాతం గంగాధర్‌ను గాయపరిచినట్లు పేర్కొన్నారు. గాయపడిన వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని రూర్బన్‌ అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే, ఎంపీ మధ్య కుదరని సయోధ్య
- నిరుపయోగంగా ఉంటున్న భవనాలు



నిరుపయోగంగా ఆడిటోరియం



ప్రారంభానికి నోచుకోని మినీ స్టేడియం

ఎడపల్లి: రాజకీయంగా ఎన్ని విబేధాలు ఉన్నా అభివృద్ధిలో కలిసి నడవాల్సిన ప్రజాప్రతినిధులు తలో దారిలో వెళ్తున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో నిర్మించిన భవనాలు ఏడాదిగా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. ఎడపల్లి మండలాన్ని డాక్టర్‌ శ్యామప్రసాద్‌ ముఖర్జీ రూర్బన్‌ ప్రాజెక్ట్‌ మిషన్‌లో ఎంపిక చేశారు. రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ వాటా 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 70 శాతంగా నిర్ణయించారు. చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో 30– 70 శాతం నిష్పత్తిలో నిధులు కేటాయించాలి. దీని ప్రకారంగా మొదటి విడతగా రూ.30 కోట్ల మంజూరు చేశారు.

ఏళ్లు గడుస్తున్నా..

మండలంలోని అనేక గ్రామాల్లో ఈ పథకంలో భాగంగా పలు నిర్మాణాలు చేపట్టారు. ఎడపల్లి మండల కేంద్రంలో మినీ స్టేడియం, ఆడిటోరియం, జైతాపూర్‌లో పశువైద్యశాల భవనం నిర్మించారు. ఈ నిర్మాణాలు పూర్తయి దాదాపు రెండేళ్లు గడుస్తుంది. వీటిని ప్రారంభిస్తే ప్రజలకు ఉపయోగపడతాయి. పనులను ఎంపీ, ఎమ్మెల్యే సంయుక్తంగా ప్రారంభించారు. నిర్మాణం జరిగినా అనంతరం కూడా ప్రోటోకాల్‌ ప్రకారం ఎంపీ, ఎమ్మెల్యేలు ఇద్దరు హాజరై వివిధ నిర్మాణాలను ప్రారంభించి వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. కానీ రాజకీయ విభేదాల కారణంగా ఎంపీ ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభోత్సవాలకు వచ్చే అవకాశాలు గత రెండేళ్లుగా కనిపించడం లేదు. దీంతో ఆయా భవనాలు ప్రారంభించకుండానే పాతబడిపోయి వాటి ఆలనా పాలనా లేక బూజు పట్టిపోతున్నాయి.

కలెక్టరే చొరవ చూపాలి

మండలంలో రూర్బన్‌ మిషన్‌ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన వివిధ నిర్మాణాల ప్రారంభోత్సవాలపై కలెక్టరే చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి ప్రజాప్రతినిధులు ఆయా భవనాలను అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని వేడుకుంటున్నారు.

మూడేళ్లలో పూర్తి చేయాలి

రూర్బన్‌ ప్రాజెక్టులో చేపట్టిన పనులు మూడేళ్లలో పూర్తి కావాలి. అలా అయితేనే రెండో విడత మరిన్ని నిధులను మంజూరు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా మరో రూ. 70 కోట్లు మండలానికి వచ్చే అవకాశం ఉంటుంది. మొదటి విడతలో చేపట్టిన పనులు పూర్తి కావడానికి నిర్ణయించిన గడువు కంటే ఎక్కువ రోజులు అయింది. మరో రూ.రెండు నుంచి రూ.మూడు కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉంది. అలీ సాగర్‌ ఉద్యానవనంలో టూరిజం శాఖ ద్వారా కోటిన్నర రూపాయల వ్యయంతో చేపట్టాల్సిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. నిధులు ఇవ్వడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సిద్ధంగా ఉన్న పనులు పూర్తి చేయించుకోవడంలో అధికారులు, నేతలు వెనుకబడి ఉన్నారు. మొదటి విడతగా వచ్చిన నిధులతో అష్ట కష్టాలకోర్చి వివిధ అంశాలను మార్పులు చేర్పులు చేసి 30 కోట్ల నిధుల పనులు పూర్తి చేయడానికి సంవత్సరానికి బదులు మూడు సంవత్సరాలు సమయం తీసుకున్నారు.

శానిటేషన్‌లో ఇష్టారాజ్యం

- ఇద్దరు శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్ల బదిలీ
- మరో ఇద్దరికి ఏళ్ల తరబడిగా ఒకే దగ్గర పోస్టింగ్‌
- నిజామాబాద్‌ బల్దియాలో కొరవడిన పర్యవేక్షణ

నిజామాబాద్‌నాగారం: మున్సిపాలిటీలో శానిటేషన్‌ విభాగం పూర్తిగా గాడి తప్పుతోంది. ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ చేపడుతున్నారు. నచ్చిన వారిని నచ్చిన చోటుకు బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు వేశారు. మరో ఇద్దరిని తాజాగా బదిలీ చేశారు. ఇంకో ఇద్దరు మాత్రం ఏళ్ల తరబడిగా ఒకే జోన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. నగరంలో ఆరు జోన్‌ కార్యాలయాలున్నాయి. ఆయా జోన్‌లకు శానిటేషన్‌ ఇన్‌స్పెటక్టర్లు ఉన్నారు. ఒక్కో జోన్‌ పరిధిలో సుమారుగా 230కి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 1400వందల వరకు కార్మికులున్నారు. నగరంలో ఉన్న 60 డివిజన్‌లకు సంబంధించి ఆయా జోన్‌లకు ప్రత్యేకంగా డివిజన్లు, కాలనీలు కేటాయించారు. వాటి పరిధిలో శానిటేషన్‌ పరంగా సమస్యలు పరిష్కారించాల్సి ఉంటుంది.

నాలుగు నెలల క్రితం ఇద్దరు శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. జోన్‌ 4ఎ(రాజీవ్‌ గాంధీ ఆడిటోరియం)లో విధులు నిర్వహిస్తున్న నటరాజ్‌గౌడ్‌ను గోల్‌హనుమాన్‌కు, జోన్‌–2 గోల్‌హనుమాన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్‌ జోన్‌–4ఎకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కలెక్టరేట్‌ పరిశుభ్రంగా ఉండడం లేదంటూ జోన్‌–1(నాందేవాడ)లో విధులు నిర్వహిస్తున్న సునీల్‌ను, జోన్‌–4బి(కంఠేశ్వర్‌)కి బదిలీ చేశారు. అక్కడ ఉన్న ప్రభుదాస్‌ను జోన్‌–1కు బదిలీ చేశారు. ఏళ్ల తరబడిగా ఒకే దగ్గర విధులు నిర్వహిస్తున్న జోన్‌–3, జోన్‌–5(అర్సపల్లి) ఇన్‌స్పెక్టర్లు మాత్రం బదిలీ కాలేదు. వారం రోజులనుంచి జోన్‌–5లో శానిటేషన్‌ జవాన్‌ వెంకటస్వామి అసభ్య పదజాలంతో దూషించారని, ఇందుకు ఎస్సై మహిపాల్‌ మద్దతు ఇస్తున్నారంటు కార్మికులు, డ్రైవర్లు డీఆర్‌సీ కేంద్రం ఎదుట నిరసన తెలిపిన విషయం తెలిసిందే. వీరిపై ఎంహెచ్‌వో, కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పర్యవేక్షణ గాలికి..

శానిటేషన్‌ విభాగం అంతా ఇన్‌చార్జి పాలనతో నడుస్తోంది. నగరంలో ఉన్న ఆరు జోన్‌లకు ఇన్‌చార్జి శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్లే ఉన్నారు. అతి ముఖ్యమైన ఎమ్‌హెచ్‌ఓ పోస్టు ఏడాదిన్నరకు పైగా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో శానిటేషన్‌ అస్తవ్యస్తంగా మారుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు.

తెయూపై మంత్రి, ఎమ్మెల్సీ స్పందించాలి

- పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్‌



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి గంగాధర్‌

ఖలీల్‌వాడి: తెలంగాణ యూనివర్శిటీలో జరుగుతున్న రిజిస్ట్రార్‌ వివాదంపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత స్పందించకపోవడంతోనే రగడ కొనసాగుతుందని పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్‌ అన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్‌ఆర్‌ హయాంలో జిల్లాలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ పదవి కోసం రెండుగా చీల్చిందన్నారు. ఈసీ ఒక రిజిస్ట్రార్‌ను, వీసీ మరొక రిజిస్ట్రార్‌ నామినేట్‌ చేయడంతో విద్యార్థులు గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. టీయూలో విద్యార్థులు, ఆధ్యాపకులు రెండు వర్గాలుగా చీలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో ఇంత తతంగం జరిగిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కవిత స్పందించకపోవడం శోచనీయమన్నారు. జిల్లా పోలీస్‌ కమిషనర్‌ రిటైర్‌ అయి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త సీపీని నియమించకపోవడం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. మంత్రికి, ఎమ్మెల్సీ కవితకి మధ్య సమన్వయం లేకపోవడంతోనే సీపీ నియామకం కాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నగర అధ్యక్షుడు కేశ వేణు, జావేద్‌ అక్రమ్‌, రాజనరేందర్‌, తాహేర్‌ బిన్‌ హందాన్‌, ఎజాజ్‌, అజీజ్‌ అన్సారీ, ఈసా, రేవతి, మలైకాబేగం, పద్మ పాల్గొన్నారు.

మళ్లీ దంచికొట్టిన వాన



రెంజర్ల కొనగోలు కేంద్రంలో తడిసిపోయిన ధాన్యం బస్తాలు

బాల్కొండ: జిల్లాలోని పలుచోట్ల ఆదివారం రాత్రి బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. రోడ్లపై ఆరబెట్టి బస్తాల్లో నింపిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. సజ్జలు వర్షపు నీటిపాలయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో బస్తాలను తిప్పి ఆరబెట్టడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కొందరికి మోదం..

ఆదివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన భారీ వర్షం వలన ధాన్యం రైతులు అవస్థలు పడగా.. మరికొందరు రైతులకు మేలు చేసింది. ముందస్తుగా వానాకాలం పంటలు సాగుచేసే రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో పసుపు, మక్క పంటలను జోరుగా సాగు చేస్తున్నారు.

13.2 మిల్లీమీటర్ల వర్షపాతం

సుభాష్‌నగర్‌: జిల్లాలో సోమవారం అర్ధరాత్రి పలు మండలాల్లో అకాల వర్షాలు కురిశాయి. సగటున 13.2 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల ధాన్యం తడిసిపోయింది. అత్యధికంగా బాల్కొండలో 32.2 మిల్లీమీటర్లు, మెండోరాలో 31.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు కూడా అకాల వర్షాలు నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మండలాలు	వర్షపాతం	కమ్మర్‌పల్లి	24.6
బాల్కొండ	32.2	ఆర్మూర్‌	31.1
మెండోరా	31.8	భీమ్‌గల్‌	22.8
నందిపేట	22.4	వేల్పూర్‌	24.5
ఏర్గట్ల	24.8	డిచ్‌పల్లి	21.6
మోర్తాడ్‌	25.9	వర్ని	14.7
మాక్లూర్‌	13.4	నిజామాబాద్‌ నార్త్‌	5.5
జక్రాన్‌పల్లి	26.8	ఇందల్వాయి	8.3
ముప్కాల్‌	26.8	ధర్పల్లి	14.5

తల్లి చేపల వేట షురూ!



చేపను పరిశీలిస్తున్న మత్స్య శాఖఅధికారి

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ జాతీయ చేప పిల్లల కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియ కోసం కావల్సిన తల్లి చేపల వేటను చెరువుల్లో ప్రారంభించారు. రెండు రోజుల నుంచి వివిధ గ్రామాల్లోని చెరువుల నుంచి తల్లిచేపలను వేటాడి ఆక్సిజన్‌ సాయంతో ఉత్పత్తి కేంద్రానికి తరలిస్తున్నారు. చెరువుల్లో పెరిగిన నాణ్యమైన మేలు జాతి చేపలను ఎంపిక చేస్తారు. కనీసం రెండు కిలోలకు తగ్గకుండ ఉన్న చేపలను వేటాడుతారు. తల్లి చేపలను కేంద్రంలోని మట్టి పాండ్లలో వదులుతారు. చేపలు సహజంగా గుడ్లను జూలై, ఆగస్టు నెలల్లో వదులుతాయి. మెండోరా మండలం బుస్సాపూర్‌, చాకీర్యాల్‌, ముప్కాల్‌ మండలం నల్లూర్‌, రెంజర్ల, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌, బాల్కొండ, జలాల్‌పూర్‌, నందిపేట్‌ మండలం ద త్తాపూర్‌, కుద్వాన్‌పూర్‌, వన్నెల్‌(కే) చెరువుల నుంచి తల్లి చేపల సేకరణ కొనసాగిస్తామని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డోలి సింగ్‌ తెలిపారు. రెండు టన్ను ల తల్లి చేపలు అవసరముంటాయని ఆయన తెలిపారు. మరోవైపు వేసవి ముగుస్తున్నా చెరువులు నిండుకుండలా ఉండటంతో తల్లి చేపలు లభించడం కష్టమవుతుందని ఫీల్డ్‌మెన్‌లు అంటున్నారు.

రేపు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

నిజామాబాద్‌నాగారం: పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్‌ 1న ఉదయం 10 గంటలకు జిల్లా బాలభవన్‌లో పర్యావరణ పరిరక్షణ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఇంజినీర్‌ లక్ష్మణ్‌ప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలిచిన విజేతలకు జూన్‌ 5న పర్యావరణ దినోత్సవం నాడు బాలభవన్‌లో జరిగే కార్యక్రమంలో కలెక్టర్‌ బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు.

వీసీ రాజీనామా చేయాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్‌
- వీసీ చాంబర్‌ ముట్టడి



వీసీ టేబుల్‌పైకి ఎక్కి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



బయటకు తీసుకెళ్తున్న పోలీసులు

తెయూ(డిచ్‌పల్లి): అవినీతి, అక్రమాలకు పాల్పడిన తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్‌గుప్తా తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. మంగళవారం వీసీ రవీందర్‌ క్యాంపస్‌కు వచ్చిన సమాచారం తెలుసుకున్న పీడీఎస్‌యూ, ఎస్‌ఎస్‌యూ, బీవీఎం విద్యార్థి సంఘాల నాయకులు పరిపాలనా భవనంలోని వీసీ ఛాంబర్‌ను ముట్టడించారు. వీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. వీసీ టేబుల్‌ పైకి ఎక్కి నినాదాలు చేశారు. ఇన్‌చార్జి సీఐ ప్రతాప్‌ ఆధ్వర్యంలో ఎస్సైలు గణేష్‌, నరేష్‌ సిబ్బందితో కలిసి విద్యార్థి నాయకులను ఛాంబర్‌ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. దీంతో వారు వీసీ ఛాంబర్‌ బయట బైటాయించి ఆందోళన కొనసాగించారు. విద్యార్థి సంఘాల నాయకులు జన్నారపు రాజేశ్వర్‌, వేణురాజ్‌, బీవీఎం విఠల్‌ మాట్లాడారు. విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన డబ్బులను పాలకమండలి అనుమతి లేకుండానే వీసీ విచ్చలవిడిగా ఖర్చు చేసి ఖజానా ఖాళీ చేశారని ఆరోపించారు. అక్రమ నియామకాలు, పదోన్నతులు చేపట్టారన్నారు. చివరకు ఉద్యోగుల వేతనాలు చెల్లించడానికి కూడా కమిషన్‌ తీసుకున్నారని ఆరోపించారు. అటు ఈసీ ఇటు వీసీ వేర్వేరుగా రిజిస్ట్రార్లను నియమించడంతో యూనివర్సిటీకి అసలు రిజిస్ట్రార్‌ ఎవరో తెలియక విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌ ఎవరనేది వెంటనే తేల్చాలని, వీసీని బర్తరఫ్‌ చేసి ఆయన అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. సుమారు మూడు గంటల పాటు విద్యార్థుల ఆందోళన కొనసాగింది. విద్యార్థి నాయకులు సంతోష్‌, స్నేహిత, లక్ష్మీనారాయణ, మోహన్‌, సైమన్‌ పాల్‌, నిఖిల్‌రెడ్డి, సయ్యద్‌ అహ్మద్‌, సందీప్‌రెడ్డి, శివ, రమణ, లక్కీ, ఉదయ్‌, లక్ష్మీకాంత్‌ పాల్గొన్నారు.

వీసీ వాహనం అడ్డగింత..

మధ్యాహ్నం 2 గంటలకు భోజనం చేయడానికి వీసీ రవీందర్‌ తన ఛాంబర్‌ నుంచి బయటకు వచ్చి వాహనం ఎక్కగానే అక్కడే ఉన్న విద్యార్థి నాయకులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని పక్కకు లాగాలని చూసినా పట్టువీడలేదు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు వీసీ కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్లారు. ఇంతలో పోలీసులు తమ వాహనంలో వీసీని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

ప్రమాదకరంగా స్తంభాల తరలింపు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నగరంలోని ఆర్మూర్‌ వెళ్లే ప్రధాన రహదారిలో భారీ సిమెంట్‌ విద్యుత్‌ స్తంభాలను అజాగ్రత్తగా ట్రాక్టర్‌పై రవాణా చేస్తున్నారు. వెనుక వైపునకు జారేలా ట్రాక్టర్‌లో పెట్టి వాటిని ఎక్కడ కూడా తాళ్లతో కట్టలేదు. దీంతో దీని వెనుక వెళ్లేందుకు వాహనదారులు భయపడ్డారు.



క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రేమ్‌కుమార్‌ (ఫైల్‌)

మాక్లూర్‌: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని మదన్‌పల్లి శివారులో జరిగింది. మాక్లూర్‌ ఎస్సై యాదగిరిగౌడ్‌ కథనం మేరకు.. అమ్రాద్‌ గ్రామానికి చెందిన గీరెడ్డి ప్రేమ్‌కుమార్‌ (18) తన తల్లి విజయ, సోదరిని బైక్‌పై ఎక్కించుకోని అమ్మమ్మ గ్రామం డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు బయలు దేరాడు. మదన్‌పల్లి శివారులో లారీని ఓవర్‌టెక్‌ చేసే క్రమంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ప్రేమ్‌కుమార్‌ తలకు బలమైన గాయంకాగా, తల్లి విజయ, సోదరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరి ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రేమ్‌కుమార్‌ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లి, సోదరి చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మిత్రుడి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

ఖలీల్‌వాడి: స్నేహితుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ సెషన్స్‌ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు.. నిజామాబాద్‌ నగరంలోని బర్కత్‌పురాకు చెందిన కరీమ్‌ లాలా, ఆటో నగర్‌కు చెందిన షేక్‌ అక్బర్‌ స్నేహితులు. అక్బర్‌, కరీమ్‌ దగ్గర రూ.12వేల అప్పు తీసుకున్నాడు. 2020 ఫిబ్రవరి 6న ఇద్దరు మద్యం తాగారు. ఈ క్రమంలో కరీమ్‌ తన డబ్బుల గురించి అడిగాడు. డబ్బులు ఏమి ఇచ్చేది లేదని అక్బర్‌ అనడంలో మద్యం మత్తులో ఉన్న కరీమ్‌ కట్టెతో అక్బర్‌ తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయన మృతి చెందాడు. ముద్దాయిపై నేరారోపణలు రుజువు కావడంతో కరీమ్‌లాలాకు ఏడేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రూ.రెండు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రవిరాజ్‌ ప్రాసిక్యూషన్‌ నిర్వహించారు.

చికిత్స పొందుతూ పలువురి మృతి

మోపాల్‌: మండలంలోని మంచిప్పకు చెందిన వడ్డె చిన్న నర్సయ్య (37) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేష్‌ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చిన్న నర్సయ్య కొన్నేళ్ల క్రితమే మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నగరంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మోపాల్‌కు చెందిన వృద్ధురాలు..

మోపాల్‌కు చెందిన జంగం పర్వవ్వ (70) మనోవేదనతో ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు. పర్వవ్వ కొడుకు రాజేశ్వర్‌, కోడలు లావణ్య ఆస్తి విషయంలో తరచూ గొడవ పడుతూ ఆమెను కొడుతుండేవారు. సోమవారం కూడా గొడవ జరిగింది. అప్పటికే మనోవేదనతో పర్వవ్వ ఆరోగ్యం మరింత క్షీణించింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. తన తల్లిని కొడుకు, కోడలు కొట్టడం వల్లే ఆరోగ్యం క్షీణించి మృతిచెందిందని పర్వవ్వ కూతురు విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినామని ఎస్సై తెలిపారు.

అడ్లూర్‌ ఎల్లారెడ్డికి చెందిన యువకుడు..

సదాశివనగర్‌: మండలంలోని అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తోట రాజేశ్‌ తెలిపారు. గ్రామానికి చెందిన నామాల మనోజ్‌(27) డీజిల్‌ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బైక్‌ ఈఎంఐ కట్టడానికి తండ్రి గంగాధర్‌ను డబ్బులు అడిగాడు. దీంతో తండ్రి మందలించాడు. మనస్తాపం చెందిన మనోజ్‌ ఈ నెల 25న రాత్రి ఎలుకల మందు తాగాడు.

గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో నిజామాబాద్‌ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్‌ షాక్‌తో రైతు మృతి



బాబురావు(ఫైల్‌)

ఇందల్వాయి: మండలంలోని గండితండా గ్రామ పంచాయతీకి చెందిన పాల్త్య బాబురావు(44) పొలం వద్ద విద్యుత్‌ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు. వివరాలు.. బాబురావు తన పొలం వద్ద విద్యుత్‌ వైర్లు బిగించేందుకు సబ్‌స్టేషన్‌ నుంచి ఎల్‌సీ తీసుకున్నాడు. వైర్లు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ సరఫరా జరిగి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఇదిలా ఉండగా బాబురావు ఎల్‌సీ రిటర్న్‌ చేయకుండానే అధికారులు విద్యుత్‌ సరఫరా చేశారని తండావాసులు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా బాబురావు ఫోన్‌చేసి ఎల్‌సీ రిటర్న్‌ చేస్తున్నట్లు చెప్పాకే విద్యుత్‌ సరఫరా చేశామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాబురావు అన్న కిషన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి ..

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండలో గుర్తు తెలియని వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. గ్రామ శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలోని తోటలో ఒక వ్యక్తి మరణించి ఉండడాన్ని గ్రామస్తులు గమనించారన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. సదరు వ్యక్తి మూడు రోజులుగా గ్రామంలో తిరుగుతూ కనిపించాడని గ్రామస్తులు తెలిపారన్నారు. మృతదేహాన్ని పరిశీలించి వడదెబ్బతో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించామన్నారు.

ధాన్యం లారీ బోల్తా



ఎల్లారెడ్డి: మండలంలోని అన్నాసాగర్‌ గ్రామ శివారులో బాన్సువాడ– ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం ధాన్యం లారీ బోల్తా పడింది. నిజాంసాగర్‌ మండలంలోని తుంకిపల్లి గ్రామం నుంచి ధాన్యం బస్తాలను లోడ్‌ చేసుకుని కామారెడ్డికి వెళ్తుండగా లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్‌ మద్యం తాగి వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు రైతులు చెప్పారు.